మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# మంత్రి హరీష్‌రావు పర్యటనకు సర్వం సిద్ధం..

### లబ్దిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేత ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మంత్రి హరీష్‌రావు పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి, అక్టోబరు 03 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో బుధవారం మంత్రి హరీష్‌రావు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు. అదేవిధంగా లబ్దిదారులకు ప్రొసీడింగ్‌లు, బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వార్తతో అన్నారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా అన్ని విధాలుగా మంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్న ఉద్దేశంతో రైతు సమన్వయ సభ్యురాలు చిట్టెం సుచరిత వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న లెక్క చేయకుండా దగ్గరుండి భర్త చిట్టెం రామన్నతో కలిసి పర్యవేక్షించారు. ముఖ్యంగా ప్రజలకు ఏం అవసరమో అవే తీర్చడంలో ముందుంటామని దానికి ఎంత కష్టమైనా భరిస్తామని భక్తుల అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు. బుధవారం ఆర్థిక మంత్రి హరీష్‌రావు మక్తల్ మున్సిపాలిటీ పట్టణంలో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఒకే వేదికపై ప్రారంభిస్తారని అందుకు శిలాఫలకాలను పూర్తి చేశామని అనంతరం భీమా ప్రాజెక్టు పంపు దగ్గర ఏర్పాట్లను పూర్తి చేశామని బహిరంగ సభ వేదికలో మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ఎంపిక చేసిన గృహలక్ష్మి లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీలు, మైనార్టీలకు ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద 150 మంది మహిళలకు స్వయం ఉపాధి కింద కుట్టు మిషన్లు పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆశాలతో ముచ్చటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే కార్మిక జెండాను వదిలి వస్తే పరిష్కార దిశగా బుధవారం మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆశాలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ఏఐసీసీ సెక్రటరీ, సీడబ్ల్యూసీ నేత వంశీచంద్‌రెడ్డితో కసిరెడ్డి భేటీ...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** ఏఐసీసీ సెక్రటరీ, సీడబ్ల్యూసీ నేత, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డితో మంగళవారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారా యణరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్‌లు మొదటి సారి వంశీ చంద్‌రెడ్డిని కలిసి కల్వకుర్తి నియోజకవర్గంలోని రాజకీయాల పరిణామాలపై క్లుప్తంగా చర్చించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. భేటి అయిన వారిలో కాంగ్రెస్ నాయకులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ్మలు ఉన్నారు.



వంశీచంద్‌రెడ్డితో భేటీ అయిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఠాకూర్ బాలాజీసింగ్‌లు

# కెసిఆర్, స్పోర్ట్స్‌కిట్స్ పంపిణీ పూర్తి చేయాలి..

### మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 03 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంగళవారం నుంచి ప్రారంభించిన కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో 6వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుండి తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్లతో కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్, బతుకమ్మ చీరల పంపిణీ అంశాలపై విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్స్ సరైన విధంగా సద్వినియోగం అయ్యేలా చూడాలని, తక్షణమే సంబంధిత శాసనసభ్యుల సమయం తీసుకుని ఆరో తేదీలోగా వారి మండలాలకు వచ్చిన అన్నిస్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేయాలని, నియోజకవర్గ కేంద్రం లేదా మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించాలని చెప్పారు. జిల్లాకు 369స్పోర్ట్స్, కిట్స్ వచ్చాయని, వీటన్నింటిని మండలపాయింట్లకు పంపించడం జరిగిందని, క్రీడా ప్రాంగణం ఉన్న ప్రతి గ్రామానికి 4రకాల క్రీడాసామాగ్రి వచ్చిందని, అందులో క్రికెట్ కిట్‌తో పాటు, స్పోర్ట్స్‌కు సంబంధించిన సామాగ్రి 75 రకాల టీషర్టులతో కూడిన కిట్టు, అదేవిధంగా 6 డంబుల్స్ వచ్చాయని, అన్ని కలిపి సుమారు 23 వస్తువులు ఉన్నాయని తెలిపారు. ముందుగా క్రీడా ప్రాంగణం ఉన్న అన్ని గ్రామాలలో వీటిని పంపిణీ చేయలని ఆయన ఆదేశించారు. బతుకమ్మ చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 3 లక్షల చీరలకు గాను ఇప్పటివరకు జిల్లాకు రెండు లక్షల 68 వేల బతుకమ్మ చీరలు వచ్చాయని, వాటన్నింటిని నియోజకవర్గాల పాయింట్లకు పంపడమే కాక మండలాలకు పంపించడం జరిగిందని, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా బతుకమ్మ చీరలను రేపటి నుండే ప్రారంభం చేస రెండు, మూడు రోజుల్లో పంపిణీని పూర్తి చేయాలని, ఏరోజు కారోజు పంపిణీ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. త్వరలో ప్రారంభం కానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి సంబంధించి ప్రతి నియోజకవర్గంలో ఒక పాఠశాలను గుర్తించాలని మన ఊరు మనబడి పనులు పూర్తయి, డైనింగ్ హాల్, తాగునీరు, అన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి సంబంధిత ఎమ్మెల్యే సమ్మతి తీసుకుని కార్యక్రమ ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇదివరకు ఉన్న వంట ఏజెన్సీలు లేదా అదనంగా ఇద్దరిని ఏర్పాటు చేసి ఉదయం అల్పాహారానికి ఇద్దరు మధ్యాహ్నం ఇద్దరిని ఉపయోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎంపిడిఓ, ఎంఈఓ నియోజకవర్గం ప్రత్యేక అధికారి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ముందూ పాఠశాలల గుర్తింపు పూర్తిచేయాలని అన్నారు. ఈ విడియో కాన్ఫరెన్స్‌లో గృహలక్ష్మి పథకంపై కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్ డిఆర్‌డిఓ యాదయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్, గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వైద్యం భాస్కర్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు హాజరయ్యారు.



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన ..

### నారాయణపేటజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, అక్టోబరు 03 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు, నోడల్ అధికారులకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుపరిచే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, సర్వైవల్ స్టాటిస్టికల్ వీవింగ్ టీంలకు టీమ్, వీడియో సర్వైవల్ స్టాటిస్టికల్ వీవింగ్ టీంలకు టీమ్ విడియో సర్వైవల్ టీమ్, విడియోకు సంబంధించిన అసిస్టెంట్ ఎక్స్‌పెండించర్ పరిశీలకులకు శిక్షణపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సరైన శిక్షణ పొంది ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. అందుకు తగిన విధంగా శిక్షణ అవగాహన పొందాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిన క్షణం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని, అందుకుగాను ఎన్నికల నిబంధనలను పాటించే విధానంపై శ్రద్ధ పెట్టాలన్నారు. అందుకు నియోజకవర్గం, మండల స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, అశోక్‌కుమార్, ఆర్డీఓ రామచందర్, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

# ఒలంపిక్ క్రీడల్లో ఆడేలా తీర్చిదిద్దాలి..

### ప్రతివ్యక్తి ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం
### మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో కెసిఆర్ క్రీడా కిట్లు పంపిణీ చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్
### హాజరైన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం నుండి అత్యధిక మంది క్రీడాకారులను ఒలంపిక్ క్రీడలలో పాల్గొనేలా చేయటమే తమ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెసిఆర్ క్రీడా సామాగ్రి కిట్ల రాష్ట్రస్థాయి పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు, ప్రఖ్యాతులు సంపాదించడమే కాకుండా, ప్రతివ్యక్తి రాష్ట్రంలో ఆరోగ్యవంతంగా జీవించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఇందులో భాగంగానే మూడున్నర సంవత్సరాల క్రితం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలన్న తమ ఆలోచనకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తోడ్పాటును అందించడంతో రాష్ట్రంలో మొదటి విడత 18 వేలు గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, ఇప్పుడు సుమారు 25 వేల గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. దేశంలోనే అన్ని గ్రామాలలో క్రీడీ ప్రాంగణాలు, క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని వెల్లడించారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ క్రీడలను కొనసాగిస్తామని తెలిపారు. ఒకప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా కరువు, కాటకాలతో, వలసలతో అల్లాడిపోయేదని, 14 రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపిగా ఉన్న సమయంలో స్వయంగా వీటన్నింటిని చూశారని, అలాంటి జిల్లాను రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో అన్ని రంగాలలో అభివృద్ధి చేసి జిల్లా రూపురేఖలు మార్చడం జరిగిందని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి పథకాలకు రూపకల్పన చేయగా, అధికారులు ఒక జట్టుగా ఏర్పడి అమలు చేస్తున్నందున ఆయన అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లాలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ఐదు రిజర్వాయర్లు పూర్తి చేయడం జరిగిందని, జిల్లా ప్రజలు వలస పోకుండా ఇక్కడే ఉండేలా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నామని తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి కాలువల ద్వారా మీరు వస్తాయని, భవిష్యత్తులో పాలమూరులో జన్మించి ఉంటే బాగుండేదని ప్రతి ఒక్కరికి అనిపించే విధంగా చేస్తామన్నారు. అదేవిధంగా యువజనశాఖ ద్వారా 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, ఎక్సైజ్‌శాఖ ద్వారా నాలుగు కోట్ల 30 లక్షల ఈతచెట్లు పెంచామని తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి స్పోర్ట్స్ కిట్స్ ఇస్తున్న రాష్ట్రం, దేశంలో ఏ రాష్ట్రం లేదని తెలిపారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న గొప్ప ఆశయముతో చేపట్టిన ఈ పథకం ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, క్రీడాశాఖ మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్‌కు దక్కుతుందని అన్నారు. క్రీడా సామాగ్రి పంపిణీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతకుమారి మాట్లాడుతూ ఒకప్పుడు కరువు, కాటకాలకు నిలయంగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా ఎవరు నమ్మటానికి వీలులేని విధంగా అభివృద్ధి చెంది రూపురేఖలు మారిపోయాయని, జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చదనం, చెట్లు, చెరువులు మత్తడి దుంకుతున్నాయని అన్నారు. తన సర్వీస్‌లో కరువుతో పాటు, కళకళలాడే పాడిపంటలను రెండు మహబూబ్‌నగర్ జిల్లాలో చూశానని అన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలలో భాగంగా 18 వేలకు పైగా గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని 25 వేల కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్‌లను పంపిణీ చేస్తున్నామని, ఒక్కొక్క కిట్టులో 50 వేల రూపాయల పైబడిన విలువైన క్రీడా సామాగ్రి ఇందులో ఉన్నాయని, వీటితో పాటు టీషర్టులను సైతం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో భాగంగా జిల్లాలో అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేసుకున్నామని, ఇప్పుడు కెసిఆర్ క్రీడాకిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు 369 కెసిఆర్ స్పోర్ట్స్ కిట్లు వచ్చాయని, కిట్లతోపాటు 75 టీ షర్టులు కూడా ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం మంత్రి వాలీబాల్, కబడ్డి క్రీడలను ప్రారంభించారు. రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ లక్ష్మి, రెవెన్యూ అదనపు కలెక్టర్లు ఎస్. మోహన్‌రావు, స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్ యాదయ్య, హన్వాడ ఎంపిపి బాలరాజు, జడ్పీటిసి విజయనిర్మల రమణారెడ్డి, సర్పంచ్ రేవతి, మహబూబ్‌నగర్ ఎంపిపి సుధాశ్రీ, జడ్పీటిసి వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి అనిత, జిల్లా యువజన, క్రీడలు అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్




స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న సిఎస్ శాంతికుమారి, మంత్రి

# పండగల సాయన్న పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందించాలి...

### 25 వేల మందితో వనపర్తిలో పండగ సాయన్న విగ్రహం ఆవిష్కరణ
### ముదిరాజ్ సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో
### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
### హాజరైన శాసనమండలి సభ్యులు బండ ప్రకాష్ ముదిరాజ్

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** పండగల సాయన్న పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందించాలని, త్వరలో 25 వేల మందితో వనపర్తిలో పండగ సాయన్న విగ్రహం ఆవిష్కరణ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముదిరాజ్ సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి. నిరంజన్ రెడ్డి శాసనమండలి సభ్యులు బండ ప్రకాష్ ముదిరాజ్ తో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రూ. 2 కోట్లతో వనపర్తిలో మత్స్యకారుల భవన్ 5వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చేందుకు నా వంతు కృషి చేస్తానని, కులాలు తాత్కాలికమని.. మానవ సంబంధాలు శాశ్వతమని అన్నారు. ఆధునికత, విద్య పెరిగిన తర్వాత సమాజంలో సమూల మార్పులు వస్తాయని, ఒకనాడు గ్రామాలలో రెండు గ్లాసుల పద్ధతిపై నిత్యం గొడవలు జరిగేవని పేర్కొన్నారు. సాంకేతికత పెరిగి పేపర్ గ్లాసులు వచ్చాక సమస్య పరిష్కారం పెరిగిపోయిందన్నారు. మారుతున్న సమాజంలో కులాలకు అతీతంగా వృత్తులను స్వీకరిస్తున్నారని, కష్టం చేసి బతికిన వారు గొప్పవాళ్లని అన్నారు. రాబోయే ఏడాదిలో మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా చెరువులు, కుంటలను పరిశుభ్రం చేయిస్తామని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి విశేషంగా విచ్చేసిన ముదిరాజ్ బిడ్డలందరికీ మంత్రి ధన్యవాదాలు తెలిపారు.



ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



మాట్లాడుతున్న శాసనమండలి సభ్యులు బండా ప్రకాష్ ముదిరాజ్

**సాగునీటి రాకతో పాలమూరు పల్లెల దశమారింది : శాసనమండలి సభ్యులు బండా ప్రకాష్ ముదిరాజ్**

ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా మారిన ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి రాకతో పల్లెల దశమారిందని శాసనమండలి సభ్యులు బండా ప్రకాష్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణకు ముందు తెలంగాణ వచ్చిన తర్వాత పరిస్థితులను గుర్తు చేసుకోవాలన్నారు. పాలమూరు కూలీలు దేశమంతా పనిచేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ 2015 లోనే వత్స్యకారులకు ఉచిత చేపపిల్లలను చెరువుల్లో వదిలారని కొనియాడారు. రాష్ట్రంలో 62 వేల మంది – మిగతా2లో..

# రాజీనామా ఇచ్చి నిరూపించుకో..

### - పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇస్తామని మోడీ చెప్పలేదు..
### - 299టీఎంసీలను ఒప్పుకున్నది కేసీఆరే కాదా..
### - మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై బీజేపీ నేత నాగురావు నామాజీ ఫైర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, అక్టోబర్3, ప్రభాతవార్త:** వివిధ సెక్షన్లకు సంబంధించి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై 21కేసులు ఉన్నాయని ఆయన రాజీనామా చేసి తన నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీ సీనియర్ నాత నాగురావు నామాజీ ఫైర్ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వివిధ పథకాల కింద వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని అవగాహన లేకుండా మంత్రి మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజనా కింద రూ.83కోట్ల మంది ఉచిత బియ్యం అందిస్తుందన్నారు. స్వచ్ఛభారత్ తెలంగాణలో 31లక్షల2వేల మరుగుదొడ్లు కట్టించింది కేంద్రమే అన్నారు. బీజేపీ నరేంద్రమోడీ తెలంగాణలో అధికారంలో లేకున్నా ఒక్క ఎకరాకు రైతుకు రూ.24వేల వరకు సబ్సిడీ రూపంలో అందజేస్తుందన్నారు. ఇది లెక్కతో సహా ఉందని చెప్పారు. కేవలం పాలమూరు పట్టణం అభివృద్ధికి అమృత్ పథకం కింద రూ.80కోట్ల 20లక్షలు మంజూరు చేయడమే కాకుండా పనులు కూడా చేపట్టామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా కింద పాలమూరు జిల్లాకు 5027ఇండ్లకు డబ్బులు కేంద్రం నుంచి మంజూరు చేసిందన్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి 11లక్షల 16వేల గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందించిందన్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో 35మోటార్లు కంటిన్యూగా 35రోజులు నిరంతరగా నడిపి ఉదండాపూర్ వరకు 63కిటోమీటర్లు ఓపెన్ టన్నెల్, 47టన్నెల్ పొడవునా నీళ్లు తరలించాల్సి ఉందన్నారు. దేశంలోని 19రాష్ట్రాల్లో అన్ని పథకాలకు ఠంచన్‌గా నిధులు, జీతాలు విడుదల చేస్తున్నామన్నారు. పాలమూరు నుంచి, నారాయణపేట నుంచి హైదరాబాద్ వరకు కేంద్రం రహదారులు పూర్తి చేయడంతో నేడు గంటన్నరలో హైదరాబాద్ చేరుకుంటున్నామన్నారు. నేషనల్ హైవేలు, రైల్వేలు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ఎక్సైజ్ శాఖ వచ్చాక ఇంటికో బెల్టు షాపు ఏర్పాటు చేసి తాగుబోతులని – మిగతా2లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగూరావు నామాజి

# బీచుపల్లిలో 200ల కోట్లతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు..!

### ప్రత్యక్షంగా పరోక్షంగా
### 1800ల మందికి ఉపాధి లభిస్తుంది
### ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగంలో
### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తాం
### నడిగడ్డలో మరోకొత్త అధ్యాయం
### రూ. 200 కోట్లతో ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఏర్పాటుకు
### శంకుస్థాపన చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి, చైర్మన్
### రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే అబ్రహాం

**ఇటిక్యాల, అక్టోబరు 03 ప్రభాతవార్త :** నడిగడ్డలో 200 కోట్లతో ఆయిల్‌ఫెడ్ సారథ్యంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1800ల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ రంగంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తామని ఆల్ఫామ్ పండక్కు సాగుకు ఎకరాకు 51 వేల రూపాయలను ప్రోత్సాహం ప్రభుత్వాలు అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీచుపల్లి గ్రామంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రూ. 200 కోట్లతో నిర్మించబోయే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాంతో కలిసి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయిల్‌ఫెడ్ వారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నడిగడ్డకు ఇది శుభదినమని స్థానికులకే ఉపాధి అవకాశాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ రంగంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు. 2003లో నష్టాల పేరుతో బీచుపల్లి ఆయిల్ ఫ్యాక్టరీని మూతవేశారని, నేను వ్యవసాయ మంత్రి అయ్యాక ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయిల్‌ఫెడ్ ద్వారా ఫ్యాక్టరీ పునరుద్దరణకు ఒప్పించామని అన్నారు. కేంద్ర సంస్థ ఎన్‌డిడిబి వద్ద ఉన్న రూ. 36 ఓట్ల అప్పును రూ. 8.40 కోట్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి ఆయిల్‌ఫెడ్ ద్వారా చెల్లించామన్నారు. ఈ ప్రాంతంలో ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ స్థాపించాలని ఆయిల్‌ఫెడ్ సంస్థను ఒప్పించి ఇక్కడ మూడేళ్ల క్రితం మొదటి మొక్క నాటానని, ఇప్పుడు ఆ ఆయిల్‌పామ్ మొక్కల నుండి కొత్తగా గెలలు వస్తున్నాయని అన్నారు. గంటకు 30 టన్నుల సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు ఎకరాకు రూ. 51 వేలు ప్రోత్సాహం అందిస్తున్నదని తెలిపారు. నాలుగేళ్ల వరకు ఆయిల్ పామ్ క్షేత్రంలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఎండాకాలంలో నీటికొరత లేకుండా చూసుకోవాలని, ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులతో సంబంధిత కంపెనీలు ఆయిల్‌పామ్ గెలలు కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకునే అవకాశం ఉన్నదని అన్నారు. దేశంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడి ఇవ్వాలని కేంద్రాన్ని పలుమార్లు కోరడం జరిగిందన్నారు. తెలంగాణ వచ్చేవరకు రాష్ట్రంలో కేవలం 40 వేల ఎకరాల్లో మాత్రమే ఆయిల్ పామ్ సాగవుతున్నది. తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాల మూలంగా లక్ష 18 వేల ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగవుతున్నదని అన్నారు. మరో ఐదు, పదేళ్ల తర్వాత ప్రపంచంలో ఆహార రంగానిదే అగ్రస్థానం, రైతులకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. తెలంగాణ వ్యవసాయ పురోభివృద్ధిపై ఈ నెలాఖరులో అమెరికాలోని అయోవా రాష్ట్రంలో జరిగే అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో వివరించనున్నామన్నారు. 40 కోట్ల ఎకరాలు సాగయ్యే బంగారు గర్భభూమి భారతదేశం అని, భవిష్యత్‌లో భారతదేశం ప్రపంచంలోనే ఆహార రంగంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ డబ్బులతో ఆయుధాలు కొనగలరేమో గాని, ఆహారాన్ని కొనలేమని తేల్చి చెప్పారు. అనేకమంది రైతులను ప్రోత్సహించి – మిగతా2లో..



ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి



# క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

- ● క్రీడలు స్నేహ బంధాన్ని పెంచుతాయి : వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ● ఖిల్లాలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14 ఖోఖో పోటీలను ప్రారంభించిన మంత్రి

**ఖిల్లాఘనపూర్,అక్టోబర్3,ప్రభాతవార్త:** జిల్లా గణపురం మండల కేంద్రంలోని స్థానిక మినీ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా అండర్ 14 పోటీన్ కోకో పోటీలకు పద్నలుగు మండలాల నుండి విద్యార్థి విద్యార్థులు పాల్గొన్న ఈ క్రీడలను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆటలలో గెలుపోటములు విద్యార్థులు సమానంగా తీసుకోవాలని చదువుల తో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యం విద్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఏర్పడ్డ తర్వాత బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల గురుకులాలు అన్ని వర్గాల పిల్లలకు ఆవసరమయ్యే సకల సౌకర్యాలతో ఏర్పాటుచేసి చదువు పై ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థికి అన్ని రంగాల్లో ముందు వస్సేలా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది ఉంది చేస్తున్న ఉంటుంది గొప్ప గొప్ప క్రీడాకారులు కూడా గ్రామీణ స్థాయి నుంచి ఎదిగిన వారే అని అన్నారు.ఇక్కడ జరిగే జిల్లాస్థాయి క్రీడలలో మీయొక్క ప్రతిభ కనబరిచి రాబోవు రోజుల్లో క్రీడలలో అత్యున్నత స్థాయి ఎదగాలని ఆశిస్తున్న అన్నారు.అనంతరం దసరా కనుక గా సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలను స్థానిక మహిళలకు అందజేశారు.ప్రతి ఆడపడుచుకు చీరలు అందేలా అధికారులు ప్రజాప్రతినిధులు చూడాలన్నారు.రెడ్ క్రాస్ సొ సైటీ వాళ్ళు చే గణపురం గ్రామపంచాయతీ కార్మికులకు చలికాలం దుస్తులు దుప్పట్లు కార్మికులకు అందజేశారు.ఈకార్యక్రమంలో మంత్రి తో పాటు జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీధర్ మండల పరిషత్ అధ్యక్షులు కృష్ణా నాయక్ తాసిల్దార్ పాండు నాయక్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య మండల విద్యాధికారి ఉషారాణి ఎంపీడీవో విజయ్ కుమార్ సింగల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి సింగల్ విండో ఉపాధ్యక్షులు కె రాజు సర్పంచ్ వెంకటరమణ రంగారెడ్డి మల్లేష్ పీఈటీలు మన్యం చిట్టి లక్ష్మి దేవేందర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



జిల్లా వ్యాప్తంగా మండలల నుండి పాల్గొన్న విద్యార్థులు

## ఎస్ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు
-1148 పాఠశాలలకు చెందిన 1లక్ష 7వేల 554 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,అక్టోబర్3 ప్రభాతవార్త:** జిల్లాలో అక్టోబర్ 5వ తేదీ నుంచి 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎ-1 (సమ్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి డాక్టర్ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని 1148 ప్రభుత్వ, ప్రైవేటు తదితర రకాల గురుకులాల పాఠశాలల్లోని 1లక్ష 7 వేల 554 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 5వ తేదీ నుంచి అక్టోబర్ 11 తేదీ వరకు సమ్మేటివ్ అసిస్‌మెంట్ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, 6,7 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 12.45 గంటల వరకు, 9,10 విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు. అక్టోబర్ 11వ తేదీ వరకు నిర్వహించబడుతాయని ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సీల నుంచి అక్టోబర్ 4వ తేదీలోగా ప్రశ్నాపత్రాలు పొందాలన్నారు. ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని, విద్యార్థులకు పని ఏర్పాటు చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీఈఓ ఆదేశించారు. మండల విద్యాధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం!

బాధిత కుటుంబాలను పరామర్శించిన నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్ రెడ్డి



**ఖిల్లాఘనపురం,అక్టోబర్3,ప్రభాతవార్త:** ఖిల్లా ఘనాపురం ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త వంగూర్ ప్రమోద్ రెడ్డి అన్నారు.ఘనపురం మండల పరిధిలోని అల్లమాయ పల్లి గ్రామంలో తెలుగు భద్రు సతీమణి మన్నెమ్మ,బదుగని శేషయ్యలు ఇటీవల అకాల మరణం చెందారు.విషయం తెలుసుకున్న ప్రమోద్ రెడ్డి మంగళవారం మృతి చెందిన వారి నివాస గృహాల వద్దకు వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు.అనంతరం వేరువేరుగా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయంను అందచేశారు.కండ్ల ముందు ఉంటూ అకాల మరణం చెందడం వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య సింగల్ విండో అధ్యక్షులు మురళిధర్ రెడ్డి సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత కూడా మనిషికి అవసరం

ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ



గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బీర హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ

**వీపనగండ్ల,అక్టోబర్3,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని సంపత్ రావు పల్లి గ్రామంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సతీమణి విజయమ్మ పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణం జరుగుతున్న రామాలయం గుడి,శివాలయం గుడి సందర్శించి తమ వంతు సహాయంగా గుడి నిర్మాణానికి రూపాయలు 1,50,000 మరియు 200 సిమెంట్ బస్తాలు విరాళంగా ఇచ్చారు.గుడి నిర్మాణానికి విరాళం ఇచ్చినందుకు గాను ఆలయ కమిటీ,రైతు కమిటీ,గ్రామ మహిళలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి ఆయన సతీమణి విజయమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ దేవాలయ కమిటీ కి గుడి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పలు సలహాలు సూచనలు చేశారు.అదేవిధంగా గ్రామంలో రెండు లక్షల ఎమ్మెల్యే బడ్జెట్ తో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.యువరైతు రాంబాబు అనే యువకుడు తన పొలం దగ్గర కరెంటు షాక్ తగిలి తన కుడి చేతిని కోల్పోయాడు. ప్రమాదానికి గురైన వ్యక్తిని పరామర్శించిన ప్రభుత్వం నుండి వైద్య ఖర్చులకోసం సీఎంఆర్ఎఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే తో మాట్లాడి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.సంపత్‌రావుపల్లి గ్రామానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సహాయ సహకారాలు అన్నివేళలా ఉంటాయని గ్రామ అభివృద్ధికి తోడ్పడతారని వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించుకోవాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోజర్ల రామేశ్వరావు,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్,ఎంపీటీసీ పెద్ద రాముడు, పరశురాముడు,సురేష్,టీజనార్దన్‌రెడ్డి,గోపాల్,బిక్షపతి,లింగారెడ్డి,చంద్రయ్య,ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

### సదరం సర్టిఫికెట్ కొత్తగా, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోండి

**వీపనగండ్ల,అక్టోబర్ 3,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ఎవరైనా దివ్యాంగులు ఉంటే సదరం సర్టిఫికెట్ కోసం కొత్తగా కానీ లేదా రెన్యువల్ అక్టోబర్ నెలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని,ప్రతివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించడం జరుగుతుందని దీనికోసం దగ్గర్లోని మీసేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని పత్రికాముఖంగా మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ,ఎంపీడీవో కథలప్ప తెలియజేయడం జరిగింది.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికుల ధర్నా

**బీడీ కార్మికులకు జీవన భృతి తక్షణమే ప్రభుత్వం ఇవ్వాలి: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్**

**అమరచింత,అక్టోబర్3,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు తక్షణమే ప్రభుత్వం జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స భవనం నుండి మండల తహసిల్దార్ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు.అనంతరం తహసిల్దార్ షేక్ చాంద్ భాషాకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వడం లేదని ఆయన అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వంపిఎఫ్‌కు సంబంధం లేకుండా బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇండ్లు లేని బీడీ కార్మికులకు గృహలక్ష్మి పథకం ద్వారా ఐదు లక్షల ఇవ్వాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి బీడీ కార్మికులను ఆదుకోవాలని ఆయన పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సామేలు,సి రాజు. వరప్రసాద్, వెంకట్ రెడ్డి,సుమిత్రమ్మ, నీలమ్మ, సువార్తమ్మ, యశోద, ఇంద్రజ, సుశీలమ్మ, ఏపన్న, జిలాని, నాగరాజు వీరితోపాటు బీడీ కార్మికులు పాల్గొన్నారు.



అమరచింత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

## నియోజకవర్గ అభివృద్ధికి అందరు కలిసి పనిచేయాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** నియోజకవర్గ అభివృద్ధికి అందరు కలిసి పనిచేయాలని ఏఐసీసీ సెక్రటరీ, సీడబ్ల్యూసీ నేత, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్ వద్ద కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలు క్రియాశీలకంగా పనిచేసిన కసిరెడ్డి నారాయణరెడ్డి, ఠాకూర్ బాలాజీ సింగ్‌లు పార్టీకి రాజీనామా చేసి వారి అనుచర వర్గీయులతో కలిసి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతు న్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా కొత్త, పాత అని తేడా లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి పని చేయాలని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సైనికుల్లా పనిచేసి గెలిపించుకొని కల్వకుర్తి గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని సూచించారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నేతలు తదితరులు ఉన్నారు.



గాంధీ భవన్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి

## తలలపై చెప్పులు మోస్తూ స్వీపర్ల విన్నూత నిరసన

**వనపర్తి క్రైం,అక్టోబర్3,ప్రభాతవార్త:** కష్టజీవులను పట్టించుకోని పాలకులు కాలగర్భంలో కలవక తప్పదని వక్తలు హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో చివరి రోజు స్వీపర్ల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి వంద రోజులు చేరుకుంది.ఈ సందర్భంగా వారు తలల పై తమ చెప్పులను మోస్తూ విన్నూత నిరసన తెలిపారు.ముఖ్య అతిధులుగా భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి కళావ తమ్మ,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎ రవీందర్,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.మాసన్న హాజరై నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు జీతం పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం వంద రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లో అంగన్వాడీలను గుర్రాలతో తొక్కించి,నీటికి రంగులు పేల్చిన వాళ్లు,విద్యుత్ ఉద్యమం పై కాల్పులు జరిపిన కనుమరుగయ్యారని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు,పంచాయతీ కార్మి కులు,ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, రెండవ ఏఎన్ఎంలు డిమాండ్ నెరవేర్చాలని చేస్తున్న ఉద్యమాలను కెసిఆర్ పట్టించుకోవడంలేదని,గుణపాఠం తప్ప దని హెచ్చరించారు. స్వీపర్లకు నెలకు 1623 రూపాయల జీతం ఇస్తున్నారని,వృద్దులకు ఇచ్చే ఆసరా పింఛన్ కంటే ఇది తక్కువ అన్నారు.రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో వ్యవసాయ కూలీ రోజుకు 600 ఇస్తున్నారని ఉపాధి కూలీ 272 రూపాయలని, స్వీపర్లకు రోజుకు 60 రూపాయలు వస్తుందని పేర్కొన్నారు.పోరాటాన్ని తత్కాలికంగా మాత్రమే విరమిస్తున్నామని,పాలకులు పట్టించుకోకుంటే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు.స్వాతంత్రం ప్రత్యేక తెలంగాణ పోరాటాల వల్లనే వచ్చిందన్నారు.స్వీపర్లు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ధైర్యం చెప్పారు.స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శోభారాణి,ఖాజా పాషా నాయకులు ఖయ్యూం,రమేష్ గోపాల్ గౌడ్, ఆలిక్, వెంకటయ్య,నాగమ్మ,గట్టమ్మ,అక్కమ్మ,చంద్రమ్మ,బి జాన్బి,నూరాన్ బి తదితరులు పాల్గొన్నారు.



తలపై చెప్పులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న స్వీపర్లు

## రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి

**అమరచింత అక్టోబర్3,ప్రభాతవార్త:** రైతులకు నష్టం జరిగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వెంకటేష్,రాజన్న,అజయ్ డిమాండ్ చేశారు.మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని రైతు సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్‌లో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కారించాలని ఢిల్లీలో రైతులు పోరాటాలు చేస్తే కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తానని ఆమెఇచ్చిన ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని వారు అన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్యమం చేస్తే కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమాలని అణిచివేయడానికి పోలీసులచే లాటి చార్జి కాల్పులు జరిపారని వారన్నారు.రైతుల పై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మద్దతు ధర ఇవ్వాలని,రైతులకు సబ్సిడీ ఎరువులు సరఫరాచేయాలని,వివిధ బ్యాంకులలో రుణాలు తీసుకున్న రైతుల వడ్డీలను మాఫీ చేయాలని వారి డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల పరిష్కరించకుంటే రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతు పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు,రైతులు పాల్గొన్నారు.



రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా అమరచింత బస్టాండ్‌లో నిరసన

## రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**వనపర్తి క్రైం,అక్టోబర్ 3,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా,కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.సంయుక్త కిసాన్ మోర్చా,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ కే ఎం రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య,జిల్లా కన్వీనర్లు బాల్ రెడ్డి, రాజన్న,మేకల ఆంజనేయులు,పరమేశ్వర చారి,సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమ సందర్భంగా అక్రమ కేసులు పెట్టి రైతులను శిక్షించడం సరైన పద్ధతి కాదని, కేంద్ర మంత్రి వెంటనే తొలగించాలి,చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.కనీస మద్దతు ధరల చట్టం చేయాలని,రైతులకు ఇచ్చిన లిఖిత పూర్వక వాగ్దాలను అమలు చేయాలన్నారు.రైతుల పై మోపిన తప్పుడు కేసులన్నీ ఎత్తివేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసహరించాలని డిమాండ్ చేశారు.కనీసం మద్దతు ధరల హక్కుల చట్టబద్దం చేయాలని డిమాండ్ చేశారు.ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ఐక్య ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్కేయం జిల్లా నాయకులు వెంకటయ్య,చింతలన్న, ఆశన్న, మనివర్దన్, అనిత, నంది మల్ల,రాములు,సునీత,ఈశ్వరయ్య,వెంకటమ్మ,కృష్ణమ్మ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు,కార్మిక సంఘాల నాయకులు

## నేడు బతుకమ్మ చీరల పంపిణీ

**వెల్దండ,అక్టోబర్ 03 (ప్రభాతవార్త):** వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా మహిళలకు అందిస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వేదిక భవన్‌లో 2 గంటలకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు, కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

## పిడుగుపాటుకు ఎద్దు మృతి



**వెల్దండ, అక్టోబర్03 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన నిట్ట బాలకృష్ణకు చెందిన ఎద్దు సోమవారం రాత్రి పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినది. రైతు బాలకృష్ణ తన వ్యవసాయ పొలానికి వెళ్లి చూసే సరికి ఎద్దు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వ పరంగా రైతును ఆదుకోవాలని వేడుకున్నాడు. మృతి చెందిన ఎద్దువిలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



జంగం భీమయ్య కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ

**వీపనగండ్ల,అక్టోబర్3,ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ మండల నాయకులతో కలిసి పలు కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.తూముకుంట గ్రామానికి చెందిన మద్దెల మాసూమ్ ఆనారోగ్యంతో చనిపోయిన విషయం తెలిసి విజయమ్మ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఇదే గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ షబ్బీర్ సోమవారం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్య నారాయణ గౌడ్,ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎద్దుల సురేందర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,ముంత శివ యాదవ్,మండల మహిళ నాయకురాలు,సునీత,ప్రజాప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

## బాల్య స్నేహితునికి ఆర్థిక సాయం



స్నేహితునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పదవ తరగతి స్నేహితులు

**వీపనగండ్ల,అక్టోబర్ 3,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన కొట్టం రవి రెండు కిడ్నీల సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని తమ స్నేహితునికి చికిత్స కోసం ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచనతో 2003 సంవత్సరానికి చెందిన పదో తరగతి స్నేహితులు అందరూ కలిసి 30 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తూ ఇంకా చికిత్సకోసం మావంతు సహాయంగా చేస్తామని స్నేహితునికి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం జరిగింది.మీసేవ తిరుపతి, సత్య నారాయణ,విజయ్,సుద్దుల రవి,శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. స్నేహితులు చేసిన ఆర్థిక సహాయానికి రవి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆశాలకు జాబ్‌చార్ట్ ఇవ్వాలి

ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు లక్ష్మిదేవి



తొమ్మిదవ రోజు కొనసాగుతున్న నిరవధిక సమ్మె

**చిన్నంబావి,అక్టోబరు03 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆశా వర్కర్ల పారితోషికాలను 18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల అధ్యక్షులు లక్ష్మిదేవి ఆధ్వర్యంలో చిన్నంబావి మండల తహసిల్దార్ కార్యాలయం ముందు గత 8 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగుతుంది. మంగళవారం 9వ రోజు సమ్మెలో భాగంగా మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాన్ని 18 వేలకు పెంచాలని, అలాగే ఫిక్స్‌వేతనం నిర్ణయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆశాలను ప్రభుత్వం గుర్తించి హెల్త్‌కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలఇవ్వాలని, పారి తోషికం లేని అదనపు పనులను వారితో చేయించకూడదని ప్రభుత్వం నిర్వహించిన వివిధ పథకాలలో తమ సేవలకు సంబంధించి పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, జాబ్‌చాట్ సైతం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాధా, కురువమ్మ, మాధవి, ఈశ్వ రమ్మ వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు సుమారు 50 మంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు జీతాలు పెంచాలి

◆తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బాపనపల్లి గోవిందమ్మ

**చిన్నంబావి,అక్టోబరు 03 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అంగన్‌వాడి టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వం జీతాలు పెంచాలని, అంగన్‌వాడిలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి 26 వేల జీతం కల్పించాలని తెలంగాణ అంగనవాడి టీచర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు బాపన్‌పల్లి గోవిందమ్మ అన్నారు.మంగళవారం రాష్ట్ర వ్యాప్త అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 23వ రోజు నిరవధిక సమ్మె కొనసాగింది. ఆమె మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు పది లక్షలు,ఆయాలకు ఐదు లక్షలు ఇవ్వాలని, చివరి వేతనంలో సగభాగం పెన్షన్ ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం ఐదు లకలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుజాత, మణెమ్మ, ఖాజాభాను, అనురాధ, సుధారాణి, వివిధ గ్రామాల అంగన్‌వాడి టీచర్లు, అంగన్‌వాడి ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలు సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

# అనాథ పిల్లలకు అండగా బాలసదనం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బాలసదనం నూతన భవనాన్ని ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి
- పాల్గొన్న జిల్లా పరిషత్ ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



బాల సదనం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్3, ప్రభాత వార్త:** దురదృష్టవశాత్తు తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ పిల్లలను ప్రభుత్వం అండగా ఉంటూ బాలసదనం ద్వారా ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో వనపర్తి పట్టణంలో కొత్తగా నిర్మించిన బాలసదనం భవనాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లి దండ్రులు కోల్పోయిన లేదా ఇద్దరిలో ఒకరు కోల్పోయిన అనాథలను బాల సదనం లో ఉంచి కే.జి.బి.వి, గురుకుల పాఠశాలలో చదివించి వారి జీవితం నిలబెట్టే విధంగా అండగా ఉంటుంద న్నారు. 60 మంది పిల్లలకు ఆవాసం చేకుర్చగల సామర్థ్యం కలిగిన నూతన బాలసదనం భవనానికి రూ. 90 లక్షలతో అన్ని సౌకర్యాలతో నిర్మించడం జరిగింది అన్నారు. పాత బాలసదనం భవనం నుండి త్వరగా మార్చాలని అదేవిధంగా బాల సాధనం లోపల, చుట్టూ పక్కల ఎల్లప్పుడూ పారిశుధ్యం పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను సూచిం చారు. తక్కువ సమయంలో మంచి నాణ్యతతో కూడిన భవనం నిర్మించినం దుకు ఇంజనీరింగ్ అధికారులను ప్రశంసించారు. జిల్లా పరిషత్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్‌వాకిటీ శ్రీధర్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రామ మహేశ్వర రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అలివేలమ్మ, సి.డి.పి.ఒ కృష్ణ చైతన్య, డి.సి.పి ఒ యం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమస్యలు పరిశీలించాలని వినతి



ఆశాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహం

**ఉండవెల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆశ వర్కర్ల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు నిలబడి ఆశ వర్కర్లు, సిఐటియు ఆధ్వ ర్యంలో నినాదాలు చేశారు. ఈసందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శులు బి.నరసింహ, వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, వేతన సంబంధం లేని పనులు చేయించరాదని పనిభారం తగ్గించాలని, వేధింపులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పద్మ, అమ్ములమ్మ, బీసమ్మ, సంతోషమ్మ, రేణుక, కృష్ణవేణి నాగలచ్చమ్మ, సునిత, భారతి పాల్గొన్నారు.

## నిరంకుశ ప్రజాస్వామిక పార్టీని గద్దె దింపుదాం!

### -జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్

**కల్వకుర్తి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** నిరంకుశ ప్రజాస్వామిక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం జేపీనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌తో కలిసి జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఏ నాడు తెలంగాణ జెండా పట్టని జైపాల్‌యాదవ్‌కు నాలాంటి ఉద్యమ కారులు ఎంతో మంది సహకరిస్తేనే ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తు చేశారు. జిల్లెల్ల గ్రామంలో ప్రభుత్వ విఫ్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ, నాపై ఎగతాళి హేళన చేసినట్లుగా మాట్లాడటం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 12 మంది బీఆర్ఎస్‌లో చేర్చుకున్న సమయంలో వారితో రాజీనామాలు ఎందుకు చేయించలేదని ఆయన ప్రశ్నించారు. వారిలా మేము పదువులను పట్టుకొని వేలాడమని, పార్టీ పదవులకు రాజీనామా చేసిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీలో చేరుతామని ఆయన తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ అకాంక్షలు నెరవేరకపోగా అన్ని రంగాల్లో తెలంగాణ విలువలు దిగజారిపోతున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దె దింపుటకు సామాజిక ప్రజాస్వామిక నిర్మాణం కొరకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. ఒక రాజకీయ పార్టీలో దానికి పొలిటిబ్యూరో రాజకీయ వ్యవహారాల కమిటీ ఉంఆలి కానీ బీఆర్ఎస్‌కు అలాంటివేవి లేవని ఆయన అన్నారు. మొత్తం ఆయన కుటుంబసభ్యులే పార్టీలో కీలక పదవులు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టికెట్ల పంపిణీ విషయంలో ఆశావాహులు ఉన్న వారిని కనీసం పిలిపించి మాట్లాడకుండా వారికి ఇష్టం వచ్చినట్లుగా వివరించడం ఏ రాజకీయ పార్టీలో లేదని విమర్శించారు. ప్రజాభిమానం సర్వేల రిపోర్టు సాకుతో మమ్మల్ని మభ్యపెట్టి కాలాన్ని వెల్లదీశారని, పార్టీ కొరకు పనిచేసిన వారికి కనీసం పట్టించుకోకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను కులాల వారిగా చీల్చి ప్రజల సొమ్మును దుర్వినియోగపరుస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి వల్లే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డికి టికెట్ ఇస్తామని చెబితేనే మేము బీఆర్ఎస్ పార్టీలో చేరామన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఓటుతో వారందరికి సమాధానం చెబుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, బాలునాయక్, హన్మనాయక్, ఏజాస్, సతీష్, మాజీ సర్పంచ్ గొమ్మకొండ రాములు, నాయకులు వెంకటయ్య, షాన్‌వాజ్‌ఖాన్, మక్బూల్, రామస్వామి, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## గ్రామ సభలోనే లబ్ధిదారుల ఎంపిక చేయాలి

**చిన్నచింతకుంట, అక్టోబరు 03 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ సభలోనే లబ్దిదారుల ఎంపిక చేయాలని బిజెపి మండల అధ్యక్షులు దశరథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితబంధు, బిసి బంధు, మైనార్టీ బంధులతో పాటు గృహలక్ష్మి పథకలు నిజమైన అర్హులకు దక్కాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చెబుతుంటే అధికార పార్టీకి చెందిన నేతలు మాత్రం ప్రభుత్వ పథకాలకు తమ స్వార్థం కోసం తమ పార్టీకి చెందిన వారిని ఎంపిక చేస్తూ అర్హులైన లబ్దిదారులను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు. మండలంలో గృహలక్ష్మి పథకానికి 7వేలకు పైగా దరఖాస్తు చేసుకోగా ఇప్పటికి అర్హులైన లబ్దిదారుల ఎంపికకై గ్రామసభ నిర్వహించలేదని ఆయన తెలిపారు. గ్రామసభ ద్వారా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని ఈనెల 5న ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# రేపే తుది ఓటరు జాబితా ప్రచురణ

## తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సరిదిద్దుకోవాలి : రోల్ అబ్జర్వర్ భారతి లక్శతి నాయక్






పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు, మాట్లాడుతున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రోల్ పరిశీలకురాలు భారతి లకపతి నాయక్

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్3, ప్రభాతవార్త:** రేపు ప్రచురించే ఓటరు తుది జాబితాలో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రోల్ పరిశీలకురాలు భారతి లకపతినాయక్ సూచించారు. మంగళవారం ఉదయం వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ప్రజావాణి హాల్లో వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల జిల్లాల అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఒ.లు, ఎ.ఈ.ఆర్.ఒ.లు, బి.ఎల్.ఒ సూపర్వైజర్ లతో తుది ఓటరు జాబితా ప్రచురణ పై సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండ జిల్లాల వారీగా మరొక్కసారి పరిశీలించి దిశానిర్దేశం చేశారు. కొత్త పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఏర్పడ్డాయి, అందులో ఎంత మంది ఓటర్లు ఉన్నారు. అనే వివరాలు పరిశీలకులు స్వయంగా తనిఖీ చేశారు. కొత్త ఓటర్లు ఎంతమంది ఉన్నారు. ఓటరు జాబితాలో నమోదు అయినవారు ఎంతమంది, ఇంకా ఎవరైనా మిగిలి పోయారా అనే వివరాలను ఈ.ఆర్.ఒ.లను అడిగి తెలుసుకున్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయినవారు తెలుసుకున్నారు. ముసాయిదా ఓటరు జాబితా సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గంలోని ప్రముఖులు అందరి పేర్లు జాబితాలో వచ్చినయా లేవా అనేది జాగ్రత్తగా చూసుకోవాలని, అదే విధంగా ఇంతకుముందు ఎన్నికలో తప్పుడు వివరాలు ఇచ్చి అనర్హత వేటు పడినవారి పేర్లు జాబితా నుండి తొలగించాలని చెప్పారు. కొత్త ఓటర్లు, తొలగించాల్సిన వారి పేర్లు అన్ని పూర్తి అయ్యాక ఫారం 16 ద్వారా పి.డి.ఎఫ్ లో మార్చుకొని, పోలింగ్ స్టేషన్ వారీగా తుది ఓటరు జాబితా ముద్రించాలని తెలియజేశారు. ఓటరు జాబితా ముద్రించిన అనంతరం అందులో దివ్యాంగులను, సీనియర్ సిటిజన్ లను గుర్తించడం చేయాలని తెలిపారు. తుది ఓటరు జాబితాను ఎలక్షన్ కమిషన్ వెబ్ సైట్ లో అప్లోడ్ చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పెట్టించి ఓటర్లు తమ పేర్లు పరిశీలించుకునే విధంగా చూసుకోవాలన్నారు. అన్ని పొలిటికల్ పార్టీలకు ఓటరు జాబితా పంపించాల్సి ఉంటుందన్నారు. ఓటరు తుది జాబితా పై ఒకరోజు అన్ని పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. కొత్తగా నమోదు అయిన ఓటర్లకు ఎపిక్ కార్డులు ముద్రించి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రచురించినందుకు సర్వం సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు, మరణించిన వారు. ఇతర నియోజకవర్గాలకు మారిపోయిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ స్టేషన్ మార్పు కోరుకున్న వారి పేర్లు మార్పు చేర్పులు చేసుకొని జాబితా తుది ప్రచురణకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. కర్నూల్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ కుమార్ దీపక్, వనపర్తి అదనపుకలెక్టర్ ఎస్. తిరుపతి రావు, గద్వాలఅదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, వనపర్తి ఆర్డీవో పద్మావతి, నాగర్ కర్నూల్ ఆర్డీవో వెంకట్రామిరెడ్డి, అచ్చంపేట ఆర్డీవో గోపి బి.ఎల్వో సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

## -ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి - దేవరకద్ర మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో సర్పంచ్‌ను సీట్లో కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే ఆల



దేవరకద్రలో ఎల్‌టి రుణాల కోసం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర, అక్టోబరు 03 ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అహర్నిషలు పాటుపడుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు గణనీయ అభివృద్ధిని సాధించాయన్నారు. దేవరకద్రలో మండలంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని చౌదర్‌పల్లిలో రూ. 20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ యుగేందర్‌రెడ్డితో కలిసిఎమ్మెల్యే ఆల ప్రారంభించారు. అలాగే గ్రామంలోని 19 మంది లబ్దిదారులకు గృహలక్ష్మీ ప్రొసెడింగ్‌లు. ముగ్గురికి ఇళ్ళ పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. కౌకుంట్ల మండలానికి చెందిన దాదాపు 17 మంది లబ్దిదారులకు రూ. 17లక్షల1వేయి 972ల విలువైనకళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే దేవరకద్రలో రూ. 20లక్షలతో నిర్మించిన పశువైద్యశాలను కూడ ఎమ్మెల్యే ఆల ప్రారంభించారు. నార్లోనికుంటలో 2.5కోట్లతో ఏర్పాటు చేసి 33/11కేవి విధ్యుత్ సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ప్రారంభించారు. బల్సుపల్లిలో సర్పంచ్ సరోజతో కలసి రూ. 20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే అడవిఅజిలాపూర్‌లో కూడ రూ. 20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ జంగం విశ్వంతో కలసి ప్రారంభించారు. కోయిల్‌సాగర్‌లో విద్యుత్ ఉపకేంద్రం పనులను ఎమ్మెల్యే ఆల ప్రారంభించారు.

**షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే:** దేవరకద్రలో రూ. 1.21కోట్లతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌ను డిసిసిబి చైర్మెన్ నిజాంపాష, పిఏసిఎస్ చైర్మెన్ దోకూర్ నరేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గోదాం, కార్యాలయం భవనాన్ని కూడ ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతేకాకుండా డిసిసిబి బ్యాంకు వారి సహకారంతో రూ. 5కోట్ల 15లక్షల చెక్కును దేవరకద్ర వ్యవసాయ సహకార సంఘం రైతులకు ఎల్‌టి రుణాలకోసం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం అహర్నిషలు పాటుపడుతుందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం పలు పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపెట్టిందన్నారు. తాగు, సాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకొన్నదన్నారు. గతంలో తాగు, సాగు నీటికి ప్రజలు పడరాని పాట్లు పడ్డారన్నారు. ఇప్పుడు ఆ సమస్య తలెత్తే ప్రసక్తేలేదన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ప్రధాన ధ్యేయమన్నారు.

**ఎమ్మెల్యే ఆలకు ఘన సన్మానం:** ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి దేవరకద్ర మండలానికి వచ్చిన ఎమ్మెల్యే ఆలకు ఆయా గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆలను సన్మానించారు. బల్సుపల్లిలో ఎమ్మెల్యే ఆలకు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్, యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్, వైస్ యంపీపీ తుమ్మల సుజాతశేఖంరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, దేవరకద్ర పిఏసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ విజయ వెంకటేశ్, యంపీడీఓ శ్రీనివాస్, తహాశీల్దార్లు ఎల్లప్ప, శ్రీనివాసులు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మధు సూధన్ గౌడ్, పశువైద్యాధికారి జీషాన్‌అలి, ఈఓ సీత్యానాయక్, సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, శివరాజ్, హన్మంతు, సరోజ, యుగేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మిగారి వెంకటేశ్, కొండ భాస్కర్‌రెడ్డి, మాజీ యంపీటీసీ ఉస్కిళ్ళ వెంకట్రాములు, సయ్యద్ గౌస్, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాష, దొబ్బలి అంజనే యులు, కొండ భాస్కర్‌రెడ్డి, మెడికల్ షాపు రాము, బీసు శ్రీనివాస్‌రెడ్డి, బైండ్ల రాములు, శంకర్, యూత్ నాయకులు యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి, జకీ, రాధా కృష్ణ, సయ్యద్ గౌస్‌పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బల్సుపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల



పశువైద్యశాలలో వైద్యుడు జీషాన్‌అలిని సీట్లో కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే ఆల

# ముదిరాజ్‌ల అభ్యున్నతికి ఎల్లవేళలా అండ

- మహబూబ్‌నగర్‌ను అన్నిరంగాల్లో నంబర్ వన్ చేస్తాం
- ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రూ. 3 కోట్లతో కమ్యూనిటి భవన నిర్మాణానికి భూమిపూజ



ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు3 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని కెకెఆర్ గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణంలో ఎంతో విలువైన శ్రీనివాస కాలనీలో 3 కోట్ల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన ముదిరాజ్ భవన్ నిర్మాణం కోసం భూమిపూజ శంకుస్థాపన చేసిన అనంతరం భారీ ర్యాలీగా శ్రీనివాసకాలనీ నుండి జెజెఆర్ గార్డెన్స్ వరకు నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్నారు. జెజెఆర్ గార్డెన్స్ మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్‌కు జిల్లా ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు భారీ ఘనస్వాగతం పలికారు. మహాసభ ఆధ్వర్యంలో మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్‌కు క్రేన్‌సహాయంతో భారీ గజమాలతో వేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కెసిఆర్ కులవృత్తులకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులపై ఎన్నో ఆంక్షలు ఉండేవన్నారు. వృత్తులను నిర్లక్ష్యం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎంకెసిఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్. హైదరాబాద్ నగరంలో ఎంతో విలువైన కోకాపేటలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అలాగే మహబూబ్‌నగర్ పట్టణంలో శ్రీనివాస కాలనీలో 3 కోట్ల రూపాయల నిధులతో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంతో కులపిచ్చి ఉండేదన్నారు. మహబూబ్‌నగర్‌ను బాగు చేయాలని లక్ష్యంతో ఇక్కడ పోటీ చేయడం జరిగిందన్నారు. గతంలో కులాలను రాజకీయంగా వాడుకుని వదిలేశారన్నారు. 2014లో శాసనసభ్యునిగా ఉన్న కాలంలోనే పండగ సాయన్న సమాధిని గుర్తించి భద్రపరచామన్నారు. వారి సమాధిని పాలరాయితో కట్టించామన్నారు. పండగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. ముదిరాజ్‌ల చైతన్యానికి తనవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రజల వెనుకబాటు తనాన్ని రూపుమాపటమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో వలసల నివారణకు పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకొస్తున్నామన్నారు. సీఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ సహకారంతో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నందున జిల్లాకు పెట్టుబడులు తరలి వస్తున్నాయన్నారు. మహబూబ్‌నగర్‌కు ఇతర రాష్ట్రాల నుండి వలసలు వస్తున్నారన్నారు. ముదిరాజ్‌లు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముదిరాజ్‌లు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా ఎదిగేందుకు తనవంతు కృషి అందిస్తామన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా ముదిరాజ్‌ల మహాసభ అధ్యక్షుడు, కౌన్సిలర్ కిశోర్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద విజయ్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, వైస్ ఛైర్మన్ తాటి గణేష్ ముదిరాజ్, పరమేష్, శేషుకుమార్, తీగల ఆంజనేయులు, ఎంపిపి బాల్‌రాజ్ ముదిరాజ్, కృష్ణమోహన్, పటేల్ ప్రవీణ్, రచయితబెక్కంజనార్ధన్, రుషి వెంకటయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, అక్టోబర్3, ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం నాన్‌చెరువుతండా గ్రామ పంచాయతీలోని ఫెంలీతండాకు చెందిన కేతావత్ మాణి(70) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువనేత, ఎంపీటీసీ చించోడ్ అభిమన్యురెడ్డి బాధిత కుటుంబానికి సంతాపం తెలిపి రూ. 5వేల ఆర్థికసాయం ప్రకటించారు. ఈమేరకు అభిమన్యు యువసేన సభ్యులు మంగళవారం తండాకు వెళ్లి బాధితకుటుంబ సభ్యులను పరామర్శించిరూ. 5వేలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరి రవినాయక్, రాజాపూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాండునాయక్, డిప్యూటీ సర్పంచ్ మహేందర్‌నాయక్, ఎంపీటీసీవెంకట్‌నాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.



## తిర్మలాపూర్ హెచ్‌ఎంకు సన్మానం



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, అక్టోబర్3, ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం తిర్మలాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా హెచ్‌ఎంగా బదిలీ అయిన సుధాకర్‌ను బీఆర్ఎస్‌పార్టీ మండల యూత్‌వింగ్ అధ్యక్షుడు బంగారి వెంకటేశ్ తిర్మాలాపూర్ గ్రామస్తులు సన్మానించారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. విద్యతోపాటు క్రీడలు, క్రమశిక్షణ విద్యార్థులకు అవసరమని వారిని అన్ని రంగాల్లో రాణించేలా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పాల్, జైపాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీచైర్మన్ మాలగల చంద్రయ్య, నర్సింగరావు, సత్యం, కృష్ణ, మహేందర్, జీకే చిన్న, శ్రీశైలం, శివకృష్ణ, శ్రీధర్, ప్రకాశ్, ప్రవీణ, గోపాల్, చరణ్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**అయిజ, అక్టోబరు3 ప్రభాతవార్త:** దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అలంపూర్ ఎమ్మెల్యే డా. వివిఎం అబ్రహం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉప్పల గ్రామంలో 15 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, నౌరోజీ క్యాంపు గ్రామంలో 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, 1.80 కోట్ల రూపాయలతో బిటి రోడ్డు ప్రారంభోత్సవం చేశారు. చిన్నతాండ్రపాడు గ్రామంలో 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, ఈడిగోనిపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాలకు మంచి చేయడమే బిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామాన్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలు ఇవాళ తెలంగాణలో జరుగుతున్నదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతి నిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ క్రిందపడి వృద్ధురాలు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** టిప్పర్ క్రిందపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం తూడుకుర్తి గ్రామంలో సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం టీఎస్12యూడీ4617 నెంబరు గల టిప్పర్ తూడుకుర్తి గ్రామంలోని ఊరగట్టు కాల్వ నుంచి ఎర్ర మట్టిని అక్రమంగా నాగర్‌కర్నూల్‌కు తరలిస్తున్నారని, గ్రామ ప్రజలు పలుమార్లు అక్రమ రవాణా పట్ల సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం కారణంగానే వృద్ధురాలు మృతి చెందిందని తెలిపారు. అదే విధంగా గ్రామంలో ఇసుక మాఫియా కూడా విచ్చలవిడిగా ట్రాక్టర్ల ద్వారా ఇష్టానుసారంగా ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అక్రమ రవాణా కారణంగానే గ్రామానికి చెందిన బోయ చంద్రమ్మ (65) రోడ్డు దాటుతున్న క్రమంలో టిప్పర్ డ్రైవర్ అజాగత్తతో ముందర టైర్ క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందినది. మృతురాలికి భర్త బాలపేరు, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.